అకాల వర్షం.. అపార నష్టం


వాననీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం


తడిసిన ధాన్యాన్ని కుప్పచేస్తున్న రైతు

- రైతులను వెంటాడుతున్న వర్షాలు
- జమ్మికుంటలో భారీ వర్షం
- తడిసి ముద్దయిన ధాన్యం
- బోరున విలపిస్తున్న అన్నదాతలు

జమ్మికుంట: అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. చేతికి అందవచ్చిన పంట వర్షం పాలు అవుతోంది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడసి ముద్దయింది. వారం రోజులుగా ఆరబెతున్న ధాన్యం ఒక్కసారిగా కురిసిన వానకు తడిసిపోయింది. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలింది. ధాన్యం కుప్పలపై పరదాలు, టార్పాలిన్లు కప్పినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోని అధికారులు రంధ్రాలు పడిన టార్పాలిన్లు అందించడంతో మరింత నష్టం జరిగిందని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుంటే మ్యాచర్ పేరుతో క్షేత్రస్థాయిలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, జాప్యం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వెంట వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి



ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చి వారం రోజులవుతోంది. వడ్లు ఎండుతుంటే మబ్బులతో నిమ్ము వస్తోంది. అధికారులు మ్యాచర్ రావాలంటున్నారు. కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు లేవు, టార్పాలిన్లకు రంధ్రాలు పడ్డాయి. ఓ వైపు అరిగోస పడుతూ ఉంటే ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం తడిపోయింది. వెంట వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి.

– ల్యాదల్ల కొంరయ్య, రైతు, సైదాబాద్ గ్రామం, జమ్మికుంట

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- చొప్పదండి మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం


మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి: వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ చొప్పదండి మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన మండల సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... నష్టపోయిన రైతులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని ప్రతి రైతు పేరు నమోదు చేయాలన్నారు. మండలంలోని అర్నకొండ, భూపాలపట్నం,చొప్పదండి, మంగళపల్లి, చిట్యాలపల్లి, రాగంపేట, రెవెల్లి, పెద్దకుర్మపల్లి గ్రామాలలో పంట నష్టం జరిగిందని రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు శాస్త్రీయంగా నివేదికలు రూపొందించడంలేదని, వ్యవసాయాధికారులు పారదర్శకత పాటించటంలేదని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రశ్నించారు. గుమ్లాపూర్‌లో పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించలేదని బత్తుల లక్ష్మీనారాయణ నిరసన వ్యక్తం చేశారు. ఇంకుడుగుంతల బిల్లులు చెల్లించకుండా ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఎంపీటీసీలు ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తక్షణం పరిష్కారం చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీడీవో ఇనుకొండ స్వరూపరాణి, తహసీల్దార్ అంబటి రజిత, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కస్తూరి, వైస్‌ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

బుద్ధ పూర్ణిమ జయంతి


నివాళి అర్పిస్తున్న కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం భవనంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధ పూర్ణిమ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి హాజరై గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ మండల అధ్యక్షుడు పారునంది జలపతి, నల్లగొండ ఎంపీటీసీ పద్మ, వంతడుపుల సంపత్, లత, మురళి, రవి, అశోక్ నందకిషోర్ పాల్గొన్నారు

క్లుప్తంగా

గొడిశాలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణ చేస్తున్న గ్రామస్తులు

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం గ్రామస్తులు ఆవిష్కరించారు. పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన విగ్రహం ఆవిష్కరణకు ప్రముఖులు, పాలకుల కోసం గ్రామస్తులు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు వేచి చూశారు. ఆవిష్కరణకు రావాలని అతిథులను ఎన్నిసార్లు ఆహ్వానించినా సమయం కుదరడంలేదని, గ్రామంలో కొందరు నాయకులు అడ్డంకిగా మారారని చివరకి గ్రామస్తులే విగ్రహావిష్కరణ చేశారు. విగ్రహ ఆవిష్కరణ కమిటీ అధ్యక్షుడు బత్తుల తిరుపతి, సర్పంచ్ లత, సింగిల్ విండో వైస్ చైర్మన్ కలకోటి కిషన్‌రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ జున్నూతుల భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజేందర్‌రెడ్డి, పోగు రమేష్, జన్నపురెడ్డి సురెందర్‌రెడ్డి, మంజులరెడ్డి, భిక్షపతి, గోపి, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

హుజూరాబాద్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హుజురాబాద్ పట్టణంలోని మామిళ్ల వాడకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు నల్గొండ సమ్మక్క కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం మున్సిపల్ తరుపున రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. దశదినకర్మకు తనవంతు సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు మారేపల్లి సుశీల, కల్లేపల్లి రమాదేవి, ప్రతాప తిరుమల్‌రెడ్డి, అపరాజ ముత్యంరాజు, నాయకులు గందె శ్రీనివాస్, ఇరుమల్ల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతును ఆదుకోవాలి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో శుక్రవారం పిడుగుపాటుతో రైతు బొజ్జ కొమురయ్యకు చెందిన పశువులు మృతి చెందాయి. లక్ష రూపాయల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ గంప మల్లీశ్వరీ, సహకార సంఘం డైరెక్టర్ గంప వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతుకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు.

శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి


హాకీ శిక్షణ శిబిరం ప్రారంభంలో సారయ్య

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సాల్లు సారయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపును సర్పంచ్ చేరాల మనోహర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించే కబడ్డీ, హాకీ వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ వేముల రవికుమార్, కోచ్ సీహెచ్ పరబ్రహ్మం, కె.రాజకుమార్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కంటి వెలుగు శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్‌లో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కంటి సమస్య ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ్ర రాజయ్య, వైస్‌ఎంపీపీ రమేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి కీర్తన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన శనిగరపు శ్రీనివాస్ (45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాస్ ముగ్గురు చెల్లెల్ల వివాహాలకు మూడు లక్షలకుపైగా అప్పుచేశాడు. అప్పు ఎలా తీర్చాలనే బెంగతో మానసికంగా కుంగిపోయాడు. దీంతో అనారోగ్యానికి గురై ఈ నెల 4న పురుగులమందు తాగాడు. మృతుడి భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు అండగా ఉంటుందని, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి భరోసా కల్పిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. జువ్వాడి చొక్కారావు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు చేస్తూ రైతు పక్షపాతి ప్రభుత్వమని మళ్లీ నిరూపించుకుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, చీకట్ల రాజశేఖర్, కొత్త గంగారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంటలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ దివ్యభారతి, కేడీసీసీ జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్, కేంద్రం నిర్వాహకులు అశోక్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


రామడుగు: వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


ఖాసీంపేటలో ఉత్సవమూర్తుల ఊరేగింపు


తిమ్మాపూర్: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామడుగు: మండలంలోని మోతె గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీఅలువేలుమంగ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాలను భోగ రజితలక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, సర్పంచ్ అంబటి నారాయణ, ఉపసర్పంచ్ మహేష్, మాజీ సర్పంచ్ ఊకంటి చెంద్రారెడ్డి, కొండగట్టు దేవాలయ ట్రస్టు సభ్యులు బండపెల్లి యాదగిరి, పులకం నరసయ్య, మాజీ ఎంపీటీసీ బత్తిని మునయ్య భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ భక్తులకు భిక్ష

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం 60 మంది హనుమాన్ మాలధారణ భక్తులకు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు భిక్ష ఏర్పాటు చేశారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీ మానసాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ మానసాదేవి, అపూరూపలక్ష్మీ, శ్రీ సీతారామాంజనేయ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డాక్టర్ బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఏలేటి స్వప్న, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని నేదునూరు గ్రామంలో అష్టమ వార్షికోత్సవంలో భాగంగా శ్రీ గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం, విశ్వజన ఆరాధన, పూలవంత హోమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వొంటెల శ్రీనివాస్ రెడ్డి, వొంటెల నారాయణరెడ్డి, వొంటెల రవీందర్ రెడ్డి, శ్రీరంగారెడ్డి, మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: గొర్రెల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఒక్క యూనిట్ రూ. 1.75,000 కాగా, లబ్ధిదారుడు వాటా రూ. 43,750 కలెక్టర్‌కు అకౌంట్‌కు పర్చువల్ ఐడీతో ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలిపారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ, బ్యాంకు పాస్‌బుక్, నామినీ జిరాక్స్ పత్రాలను అందజేయాలన్నారు. గొర్రెల సేకరణకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఎంపిక చేశామని, జిల్లా స్థాయి అధికారులు సమక్షంలో పంపిణీ చేస్తామని తెలిపారు. జేడీ నరేందర్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి సాంబరావు, జేఈవో అభిషేక్, నాయకులు న్యాత సుధాకర్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయాలని వినతి

మానకొండూర్: రెండో విడత గొర్రెల పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా ఉండాలంటే నగదు బదిలీ ప్రత్యామ్నాయ మార్గమని మానకొండూర్ మండల ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సొసైటీ సభ్యులు మానకొండూర్ రైతు వేదికలో పశుసంవర్ధకశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. 18 ఏళ్లు నిండిన యాదవ, కురుమ కుటుంబాలకు చెందిన వారికి పథకంలో అర్హత కల్పించాలని కోరారు. మొదటి ప్రాధాన్యతగా లబ్ధిదారుల అకౌంట్లోకి నగదు బదిలీ చే యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాలి రమేష్ యాదవ్ ,తోకల రాజు యాదవ్, కొమరవెల్లి యాదవ్, మునీందర్ యాదవ్, సంపత్ యాదవ్, ప్రదీప్ యాదవ్, అట్ల గట్టయ్య యాదవ్ ఉన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

ఇల్లందకుంట: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపు, నమోదుపై బీఎల్‌వోలకు శుక్రవారం తహసీల్దార్ మాధవి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పూర్తి వివరాలు నిర్ధారణ చేసుకున్న తర్వాత మృతి చెందినవారి పేర్లు జాబితా నుంచి తొలగించాలని, క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరుగుతూ వందేళ్లు పైబడిన వృద్ధుల వివరాలు ఆరాతీయాలని సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మి, బూత్ లెవెల్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మధురానగర్‌లో మహిళ సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాతే గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని, మిషన్ భగీరథ ద్వార ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని, మిషన్ కాకతీయతో చెరువులు, కుంటలు మరమ్మతులు చేశామన్నారు. ప్రతీ కులసంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల లావణ్య, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయాల ఎదుట సమ్మె


గన్నేరువరం: సమ్మెలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు

మానకొండూర్‌రూరల్/గన్నేరువరం/తిమ్మాపూర్/చిగురుమామిడి: మండల పరిధిలోని వివిధ గ్రామ గ్రామపంచాయతీల కారోబార్లు, సఫాయి కార్మికులు, సిబ్బంది డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల ఎదుట శుక్రవారం సమ్మె చేపట్టారు. జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అంజయ్య మాట్లాడుతూ... కారోబార్లకు, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక హోదా కలిపించి కనీస వేతనం చెల్లించాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేటగిరి వారీగా హోదా కల్పించి కనీస వేతనం ఇవ్వాలని,పంచాయతీ నిధులు కాకుండా ప్రభుత్వం నేరుగా వేతనాలను అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మెలో పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎడ్లు మృతి



గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేటలో పిడుగుపాటుకు రెండు ఎడ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బొజ్జ కొమురయ్య తన పశువులను శుక్రవారం పాక వద్ద కట్టేశాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో జీవాలు చనిపోయాయని గ్రామస్తులు తెలిపారు. వాటి విలువ రూ.1.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. పశువుల కళేబరాలను ఇన్‌చార్జి పశువైద్యాధికారి సాంబరావు, జేఈవో అభిషేక్, ఆర్ఎస్ఎస్ మండల కో–ఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డిలు పరిశీలించారు.

మానవాళికి అవసరమైన పరిశోధనలు చేయాలి


ఫేసెట్–23 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైభవ్‌షా,అధ్యాపకులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో మానవాళికి అవసరమైన పరిశోధనలు చేయాలని బెంగుళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ యూబీ ఉపాధ్యక్షుడు వైభవ్‌షా అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫ్యూచరిస్టిక్ ఏరియాస్ ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఫేసట్–23) రెండు రోజుల జాతీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రపంచ శాస్త్రీయ సాంకేతిక అభివృద్ధిలో భారతదేశ సేవలు ప్రశంసనీయమని, భారతీయులు అన్ని రంగాల్లో సేవలు అందిస్తున్నారని, ఆధునిక మానవ జీవితం కంప్యూటర్‌తో విడదీయలేనిదిగా ముడిపడి ఉందని, ప్రతీ అంశంలో కంప్యూటర్ భాగస్వామ్యం ఉందన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంతో వివిధ టెక్నాలజీ విషయాలపై మేధావుల చర్చ జరిగి కొత్త ఆవిష్కరణలకు వేదికగా మారుతాయన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా. కె. శంకర్ మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌ను అధ్యాపకులు, విద్యార్థులు ఒక వేదికగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, కాన్ఫరెన్స్ కన్వీనర్ కెప్టెన్ డా.కె.రవీంద్రబాబు మాట్లాడుతూ.. సదస్సులో దేశం, వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 165 సాంకేతిక వ్యాసాలు (టెక్నికల్ పేపర్స్)వచ్చాయని, వాటిని పుస్తకరూపంలోకి (కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్) తీసుకొచ్చామని, ఐ.యస్.బి.ఎన్ వచ్చిందని, అధ్యాపకులు తమ పరిశోధనలను ప్రెజెంట్ చేస్తారని అన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ డీన్ అకాడమిక్, ప్రొఫెసర్ వి.షమిత, కాన్ఫరెన్స్ కో కన్వీనర్స్ డా.డి.సునీత, ఇ.ప్రదీప్, రిజిస్ట్రార్ పి.వెంకటయ్య,బెంగుళూర్‌కి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ పార్టీ టూ స్టూడెంట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజ్ కోగంటి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ప్రణీత్ కుమార్, యాకూబ్, సంజీవ రాజు, రఘు, ప్రశాంత్ కుమార్, పవన్ కుమార్, ఆర్తి, గౌతమ్‌కుమార్, ప్రసాద్, భాస్కర్ ప్రకాష్, భారతి, దేశ్‌పాండే, దీపక్, మమత, ఫాతిమా, జరీన్, రఘుపతి, విదీష,ప్రేమ్‌కుమార్, రోహిత్, ఇతర విభాగాల అధిపతులు, ఆఫీసర్ ఇంచార్జులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



మానకొండూర్: మండలంలోని పెద్దూరు పల్లె గ్రామానికి చెందిన తంగళ్లపల్లి స్వరూపరాణి,సంపత్ దంపతుల కూతురు వివాహానికి బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు శుక్రవారం పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, రమణయ్య, అశ్విన్, విజయ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.